సాక్షి
పెద్దపల్లి
గురువారం । 2 । ఫిబ్రవరి । 2023



చక్రతీర్థోత్సవం..

కరీంనగర్ మార్కెట్‌రోడ్ శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం చక్రతీర్థోత్సవం, వసంతోత్సవం ఘనంగా నిర్వహించారు.



క్రీడాకారులను వెలికితీసే వేదిక..

మెరికల్లాంటి క్రీడాకారులను వెలికి తీసేందుకు 'సాక్షి' ప్రీమియర్ లీగ్ ఒక వేదికలాంటిదని, మంత్రి గంగుల కమలాకర్ అన్నారు.

18లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0 /20.0

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు కొంచెం పెరుగుతాయి. సాయంత్రం చలిగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

శ్రీనంబులాద్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



శ్రీలక్ష్మీనంబులాద్రి ఆలయం

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని దేవునిపల్లి గ్రామంలోగల శ్రీలక్ష్మీనంబులాద్రి స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. బుధవారం తొలిరోజు స్వామివారి తిరుకల్యాణోత్సవం నిర్వహించారు. ఈనెల 2న హవనం, బలిహరణం, తీర్థప్రసాద వితరణ, 3న మహాదాశీర్వచనం, పల్లకిసేవ, 4న బలిహరణం, హనుమత్ సేవ, 5న శేషవాహనసేవ, బలిహరణం, 06న పూర్ణాహుతి (శేష హోమం), గరుడ సేవ, దోపోత్సవం, తిరుమంగైఆళ్వార్ల చరిత్ర, 7న రథోత్సవం (జాతర), నాగబలి, పుష్పయాగం, ఏకాంతసేవ, చక్రతీర్థం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఏసీడీ చార్జీలు తగ్గించాలని కాంగ్రెస్ రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ధర్మారం: ప్రభుత్వం అదనంగా విధిస్తున్న విద్యుత్ ఏసీడీ చార్జీలను రద్దుచేస్తూ.. నాణ్యమైన త్రీఫేస్ కరెంట్‌ను అందించాలని డిమాండ్ చేస్తూ మండలకేంద్రంలో బుధవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. కాంగ్రెస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హాజరయ్యారు. ఏసీడీ పేరుతో సామాన్యుల నుంచి చార్జీలు వసూలు చేయడం సరికాదన్నారు. సమయపాలన లేకుండా వ్యవసాయానికి విద్యుత్ సరాఫరా చేస్తుండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బద్దం గంగారెడ్డి, బ్లాక్–2 అధ్యక్షుడు కోమటిరెడ్డి రవీందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ పాలకుర్తి రాజేశంగౌడ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహిపాల్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు మోటపలుకుల అశోక్, నాయకులు పాల్గొన్నారు.

ఓదెలలో రైళ్లు ఆపండి



కేంద్రరైల్వేమంత్రి అశ్విన్‌వైష్ణవ్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న మాజీఎంపీ వివేక్

ఓదెల: ఓదెల రైల్వేస్టేషన్లో పలు రైళ్లకు హాల్టింగ్ కల్పించాలని మాజీ ఎంపీ వివేక్ ఢిల్లీలో కేంద్ర రైల్వేమంత్రి అశ్విన్‌వైష్ణవ్‌కు వినతిపత్రం ఇచ్చారు. రామగిరి, పుష్పుల్, నాగపూర్ ప్యాసింజర్ రైళ్లు ఆగేలా చూడాలని కోరారు. జిల్లాలోని రైల్వేస్టేషన్లో ప్లై ఓవర్‌బ్రిడ్జిలు లేని లెవల్ క్రాసింగ్ గేట్ల వద్ద ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని, 108, 104 వాహనాలూ ఆపాల్సిన దుస్థితి ఏర్పడుతోందని పేర్కొన్నారు. దీనికి రైల్వేమంత్రి సానుకూలంగా స్పందించారని వివేక్ తెలిపారు.

కోర్టు భవనాల సముదాయానికి భూమిపూజ




శిలాఫలాకాన్ని ప్రారంభిస్తున్న జడ్జిలు

గోదావరిఖని: గోదావరిఖని శారదానగర్‌లో రూ.20కోట్లతో నిర్మిస్తున్న కోర్టు భవనాలు, న్యాయమూర్తుల నివాస గృహ సముదాయానికి బుధవారం భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమాన్ని హైకోర్టు చీఫ్ జస్టిస్ ఉజ్వలభూయాన్ వర్చువల్ ద్వారా ప్రారంభించారు. జిల్లా కోర్టు జడ్జి నవీన్‌రావు, పోర్ట్‌పోలియో జడ్జి శ్రావన్‌కుమార్, నాగరాజు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు శైలజ పాల్గొన్నారు.

పత్తి క్వింటాల్‌కు రూ.7,861

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం పత్తి క్వింటాల్‌కు రూ.7,861 పలికింది. కనిష్టంగా రూ.7,001, సరాసరి రూ.7,761గా నమోదైనట్లు ప్రత్యేక శ్రేణి కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్ తెలిపారు.



విమానాశ్రయం కోసం గుర్తించిన బసంత్‌నగర్‌లోని స్థలం

ఉమ్మడి జిల్లాకు నిరాశే

బసంత్‌నగర్ విమానాశ్రయంపై బడ్జెట్‌లో రాని స్పష్టత

- కరీంనగర్ ట్రిపుల్ ఐటీపైనా దొరకని హామీ
- ఆస్తిపన్ను విధింపుపై మిశ్రమ స్పందన
- ఈసారి కూడా నెరవేరని కేంద్రీయ, నవోదయ స్కూళ్లు
- నర్సింగ్ కాలేజీ కేటాయింపుల్లోనూ దక్కని అవకాశం

కేంద్ర బడ్జెట్ 2023–24 ఉమ్మడి జిల్లా ప్రజల ఆశలపై నీళ్లు చల్లింది. ఎలాంటి కేటాయింపులూ జరగలేదు. ముఖ్యంగా ఎయిర్‌పోర్టులు, జాతీయ రహదారులలో ఉమ్మడి జిల్లాకు కేటాయింపులు దాదాపుగా లేవనే చెప్పాలి. అదే సమయంలో సగటు ఉద్యోగిపై ఆదాయపు పన్ను విషయంలో మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. కొందరు పన్ను విధానాన్ని ప్రశంసిస్తుంటే.. మరికొందరు విమర్శిస్తున్నారు.

సాక్షి ప్రతినిధి, కరీంనగర్

నెరవేరని విభజన హామీలు..

- రాష్ట్ర విభజన హామీలకు సంబంధించి జిల్లాకు ఒకటి చొప్పున సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి నవోదయా స్కూళ్లు, కేంద్రియ స్కూళ్లు ఇస్తానని మాట ఇచ్చిన కేంద్రం ఈసారి బడ్జెట్‌లోనూ ఎలాంటి హామీలు, కేటాయింపులు చేయలేదు. దీంతో ఈసారి కూడా తాజా బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు నిరాశే మిగిలింది.
- బడ్జెట్‌లో ఎంపిక చేసిన 50 విమానాశ్రయాల్లో తెలంగాణ నుంచి బసంత్‌నగర్ ఎయిర్‌పోర్టు ఉందా? లేదా అన్న దానిపై స్పష్టత రావాల్సి ఉంది. అయితే.. ఈ విషయంలో రాష్ట్రం ఎలాంటి ప్రతిపాదనలు పంపలేదని కేంద్రం మొదటి నుంచి చెబుతూ వస్తోంది.
- దేశవ్యాప్తంగా 174 నర్సింగ్ కాలేజీలను కేంద్రం మంజూరు చేసింది. ఇందులో మూడు ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లగా తెలంగాణకు ఒక్క కాలేజీ కూడా మంజూరు కాలేదు. ఇటీవల ప్రతీ జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఇచ్చిన క్రమంలో నర్సింగ్‌కాలేజీలకు అనుమతి ఇచ్చి ఉంటే మరింత ప్రోత్సాహకరంగా ఉండేదని వైద్యనిపుణులు అభిప్రాయపడుతున్నారు.
- సగటు వేతనజీవికి ఆస్తిపన్ను విషయంలో మాత్రం మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. రూ.7 లక్షల వరకు పన్ను మినహాయింపు ఇవ్వడంపై కొందరు ప్రజలు స్వాగతిస్తున్నారు. అదే రూ.3 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు ఉన్న ఆదాయానికి 5% పన్నుపై మరికొందరు పెదవి విరుస్తున్నారు.
- మైనార్టీ బాలబాలికల స్కాలర్‌షిప్పుల రద్దుపై ముస్లిం నాయకులు మండిపడుతున్నారు. ఇది మైనార్టీ వ్యతిరేక ప్రభుత్వమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పేదలపై పెనుభారం



కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేద, మధ్యతరగతి ప్రజలపై భారం మోపింది. ఉపాధి, విద్య, వైద్యరంగాలకు సరైన కేటాయింపులు లేవు. కార్పొరేట్ శక్తులకు అనువుగా ఈ బడ్జెట్ రూపొందించినట్లు కనిపిస్తోంది.

– ముత్యంరావు, సీఐటీయూ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి

నిరుద్యోగులకు నిరాశే..!



ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా కేంద్రబడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం నిరుద్యోగులకు నిరాశనే మిగిల్చింది. దేశంలోని 81 కోట్లమందికి ఉచితంగా రేషన్‌బియ్యం ఇస్తున్నామని అంకెల గారడీ చేసిన కేంద్రం.. ఇంధన ధరలు తగ్గింపు ప్రస్తావనే తేలేదు.

– కొంకటి లింగమూర్తి, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యుడు

'ఉపాధి' పనులపై స్పష్టత లేదు



గ్రామీణ ప్రాంత పేదలకు ఉపాధి కల్పించే ఈజీఎస్ పనులపై స్పష్టత లేదు. ఉపాధి పనులతో లబ్ధిపొందే పేదల ఆర్థిక పరిస్థితి దయనీయమైనా.. బడా బాబుల మేలు కోసమే కేంద్రం బడ్జెట్‌లో పెద్దపీట వేసింది. ఇది ప్రజా వ్యతిరేక బడ్జెట్.

– తాండ్ర సదానందం, సీపీఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి

ఏ రంగానికీ ప్రాధాన్యం లేదు..



కేంద్రం బడ్జెట్‌లో ఏ ఒక్క రంగానికీ ప్రాధాన్యమివ్వలేదు. ఒంటెద్దు పోకడలతో నిర్ణయాలు తీసుకుంటున్నట్లు స్పష్టమైంది. సాధారణ బడ్జెట్‌లో రైల్వేబడ్జెట్‌ను కలిపి గందరగోళం చేసింది. దేశంలో 157 మెడికల్ కాలేజీలు ఇచ్చినా తెలంగాణకు ఒక్కటీ లేదు. నర్సింగ్ కాలేజీల్లోనైనా ప్రాధాన్యమివ్వాలి.

– ఈద శంకర్‌రెడ్డి, ఐడీసీ మాజీ చైర్మన్

ఉద్యోగులకు నిరాశే..



బడ్జెట్‌లో ఉద్యోగులకు నిరాశే మిగిలింది. పాత విధానంలో ఉన్న హెచ్‌ఆర్‌ఏ, సీపీఎస్, 80సీ, 80డి, హోంలోన్, డెడ్యుకేషన్ విషయంలో మినహాయింపులు లేవు. ఉద్యోగులకు ఏదో వరాలు ఇచ్చినట్లు ప్రకటించినా.. అందులో ఏమాత్రమూ నిజం లేదు.

– మేరుగు రాజమౌళి, పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు

పెద్దపల్లి రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరితో భవన నిర్మాణ కార్మికులు నష్టపోతున్నారని, వారికి న్యాయం చేయాలని కోరుతూ ప్రగతిశీల భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం (ఐఎఫ్‌టీయూ అనుబంధం) ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. రాష్ట్ర కార్యదర్శి కట్ల రాజన్న డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందించారు. కార్మికుడు సహజ మరణం చెందితే పరిహారం రూ.1.30లక్షల నుంచి రూ.ఐదు లక్షలకు పెంచాలని, ప్రమాద మరణమైతే రూ.6 నుంచి రూ.10 లక్షలకు పెంచాలని, శాశ్వత అంగవైకల్యానికి రూ.10 లక్షలు, పెళ్లికానుక, ప్రసూతి సహాయం రూ.లక్షకు పెంచాలని, 60ఏళ్లు దాటిన కార్మికులకు రూ.ఆరు వేల పింఛన్ అందించాలని కోరారు. పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేసి కొత్త లేబర్ కార్డులకు రేషన్‌కార్డు నిబంధనలను ఎత్తివేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కన్వీనర్ గుజ్జుల సత్యనారాయణరెడ్డి, ఆడెపు శంకర్, మార్త రామన్న, ఉడుత శ్రీనివాస్, కోల స్వామి, పిల్లి సామయ్య, పొనగంటి రాజయ్య, ఆర్.లక్ష్మణ్, నస్పూరి లక్ష్మి, మార్త రాధ, కల్పన తదితరులున్నారు.

ప్రజలపై పన్నుల భారం వేయడమేనా..!

- విలీన గ్రామాల్లో అభివృద్ధి జాడేదీ?
- అవినీతి బీఆర్‌ఎస్‌కు ఇవూ ఆఖరు ఎన్నికలు
- మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు



రంగంపల్లిలో పర్యటిస్తున్న విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: ప్రజలపై పన్నుల భారం మోపడం.. భారీగా ఆదాయం సమకూర్చుకోవడమే బీఆర్ఎస్ పాలకులు పనిగా పెట్టుకున్నారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు ఆరోపించారు. గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా బుధవారం 10, 11 వార్డుల్లో పర్యటించారు. ప్రజాసంక్షేమాన్ని విస్మరించి.. అవినీతి అక్రమాలే ఎజెండాగా పనిచేస్తున్న బీఆర్‌ఎస్‌కు ఇవే చివరి ఎన్నికలని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రజల ఇబ్బందులు పట్టించుకోవడం లేదన్నారు. కరెంట్, ఆర్టీసీ చార్జీలను అడ్డగోలుగా పెంచి పేదల నడ్డి విరుస్తున్నారని పేర్కొన్నారు. నాయకులు అమిరిశెట్టి సతీశ్, వేముల రాజు, పూదరి చందు, తిరుపతి, నెత్తెట్ల కుమార్, మల్లయ్య, శ్రీనివాస్, లక్ష్మణ్, సంపత్, శ్రీమాన్, అవినాశ్, శోభ, రమేశ్, దిలీప్, సంతోష్, వీరేశం తదితరులున్నారు.

జిల్లా సరిహద్దులో కాటారం డీఎస్పీ పర్యటన



ఖమ్మంపల్లి బ్రిడ్జిని పరిశీలిస్తున్న డీఎస్పీ

రామగిరి(మంథని): పెద్దపల్లి, జయశంకర్‌భూపాలపల్లి సరిహద్దులోని ముత్తారం మండలం ఖమ్మంపల్లి, తాడిచర్ల గ్రామాల మధ్య మానేరు నదిపై నిర్మించిన బ్రిడ్జిని కాటారం డీఎస్పీ రాంమోహన్ రెడ్డి బుధవారం సందర్శించారు. రెండు జిల్లాల సరిహద్దు సమీపంలో ఉన్న పరిసర ప్రాంతాలు, పరిస్థితులపై అడిగి తెలుసుకున్నారు. సరిహద్దు ప్రాంతాలపై నిఘా పెంచామన్నారు. ఆయన వెంట కాటారం సీఐ రంజిత్ రావు ఉన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగాలకు దరఖాస్తులు

- జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్

పెద్దపల్లిరూరల్: జిల్లాలో జాతీయ ఆరోగ్య మిషన్ పథకం కింద.. ఆయుష్ విభాగంలో ఖాళీగా ఉన్న పోస్టులకు ఈనెల 20 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని డీఎంహెచ్‌ఓ ప్రమోద్‌కుమార్ తెలిపారు. ఆయుర్వేద వైద్యులు–3, హోమియోపతి–1, నేచురోపతి–1 పోస్టులను కాంట్రాక్టు పద్ధతిన భర్తీ చేసేందుకు ఆసక్తి, అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వివరించారు. అభ్యర్థులు డీఎంహెచ్‌ఓ, పెద్దపల్లి పేరిట రూ.300 డీడీ జతపర్చాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఫీజు మినహాయింపు ఉందన్నారు.

సర్వేకు ఎలా వస్తారు..?

- సింగరేణి భూసేకరణ సర్వేను అడ్డుకున్న రైతులు
- అధికారులను తిప్పి పంపిన వైనం



అధికారులను నిలదీస్తున్న రైతులు

రామగిరి(మంథని): సింగరేణి సంస్థ ఆర్జీ–3 పరిధి ఓసీపీ–2 విస్తరణకు భూసేకరణలో భాగంగా బుధవారం ఎంజాయ్‌మెంట్ సర్వేకు వచ్చిన రెవెన్యూ, సింగరేణి అధికారులను మండలంలోని రాజాపూర్, బుధవారంపేట (రామయ్యపల్లి) రైతులు అడ్డుకున్నారు. సమాచారం ఇవ్వకుండా తమ భూములను ఎలా సర్వే చేస్తారని నిలదీశారు. గ్రామాల శివారులో 708.16 ఎకరాల వ్యవసాయ భూమి సేకరణకు జారీ చేసిన అవార్డును హైకోర్టు కొట్టివేసిందని, అయినా సర్వేకు రావడం కోర్టుధిక్కారమేనని పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో 70 ఎకరాల భూసేకరణకు ఎంజాయ్‌మెంట్ సర్వేకు వచ్చామని, అడ్డుకుంటే వెళ్లిపోతామని, ఉన్నతాధికారులకు నివేదిస్తామని అధికారులు తెలిపారు. సర్పంచ్ పాశం ఓదెలు, రైతులు దేవునూరి శ్రీనివాస్, లింగం రాజయ్య, కలవేన సంపత్, పుల్లెల కిరణ్, పుల్లెల సతీశ్, నూనేటి లింగయ్య, ఉగ్గే భూమయ్య, సిద్ద శ్రీధర్, పుల్లెల సంజీవ్, సిద్ద గట్టయ్య, బిర్క లింగయ్య, పుల్లెల కొమురయ్య, లింగం పవన్, పుల్లెల సురేశ్, ఉగ్గె కుమార్, తొట్ల సాగర్, పులి రాజేశం, చిప్ప రాజేశం, పుల్లెల రాజమల్లు, బుద్దర్తి బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏమ్మా.. ఆసుపత్రిలో ఇబ్బందులు ఉన్నాయా..?



ఆసుపత్రిలో రోగితో మాట్లాడుతున్న కమిషనర్

పెద్దపల్లిరూరల్: 'ఏమ్మా.. దవాఖానాకు ఎపుడొచ్చావ్.. ఇక్కడి డాక్టర్లు, సిబ్బందితో ఏమైనా ఇబ్బందులున్నాయా.. ఎవరైనా డబ్బులడుగుతున్నారా..' అంటూ జిల్లా ప్రభుత్వాసుపత్రిని బుధవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్, ప్రోగ్రాం అధికారి వాసుదేవరెడ్డి. ఆసుపత్రిలో సేవలు పొందుతున్న వారితో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. మాతాశిశు కేంద్రంలో ప్రసూతి సేవలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో సౌకర్యాలు బాగానే ఉన్నాయని కాల్వశ్రీరాంపూర్ మంగపేటకు చెందిన రాజేశ్వరి తెలిపింది. ఆసుపత్రి ఆవరణను పరిశీలించారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి మెరుగ్గా ఉంచాలని ఆదేశించారు. ఇన్‌పేషెంట్లకు మంచి ఆహారం, అవసరమైన మందులు అందించేలా పర్యవేక్షణ ఉండాలని సూచించారు. డీసీహెచ్‌ఎస్ డాక్టర్ శ్రీధర్, డ్యూటీ డాక్టర్లు రాజు, రుక్మిణి, సుభాషిణి తదితరులున్నారు.

కంటి వైద్యశిబిరాలకు స్పందన

- ఇప్పటివరకు 46,746 పరీక్షలు
- 7,784 మందికి రీడింగ్..
- 6,865 పాయింట్ కళ్లద్దాలు పంపిణీ
- 9,507 మందికి శస్త్రచికిత్సలకు సిఫారసు



కంటి పరీక్షల కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

సుల్తానాబాద్: రాష్ట్రప్రభుత్వం చేపట్టిన రెండోవిడత కంటివెలుగు కార్యక్రమానికి జిల్లాలో అనూహ్య స్పందన లభిస్తోంది. జిల్లా వ్యాప్తంగా 34 శిబిరాలు ఏర్పాటు చేసి శని, ఆదివారాలు మినహా ప్రతిరోజూ పరీక్షలు చేస్తున్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలు శిబిరాలను వినియోగించుకుంటున్నారు. డయాబెటిక్ వ్యాధిగ్రస్తులకు కంటి సమస్యలు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే రెటీనా పరీక్షలు చేసేందుకు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది వద్ద పరికరాలు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రెటినోపతి లక్షణాలు గుర్తించే యంత్రాన్ని అందుబాటులో ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

కంటిపై ప్రభావం

ఆధునిక కాలంలో సెల్‌ఫోన్ల వాడకం.. టీవీలు, కంప్యూటర్ల ముందు గంటల తరబడి కూర్చోవడం ద్వారా కళ్లపై తీవ్ర ప్రభావం పడుతోందని వైద్యాధికారులు చెప్తున్నారు. కరోనా సమయంలో ఆన్‌లైన్‌లో పాఠ్యాంశాలు బోధించడం ద్వారా విద్యార్థులు సెల్‌ఫోన్లకు అలవాటుపడ్డారు. నిద్ర లేచింది మొదలు.. రాత్రి నిద్రపోయే వరకూ సెల్ వాడకం ప్రజలకు అలవాటుగా మారింది. దీంతో కళ్లు అలసటకు గురై.. ఉద్యోగులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, కంటి సమస్యతోపాటు బీపీ, షుగర్ వ్యాధికి కారణమవుతోందని వైద్యాధికారులు చెబుతున్నారు.

ప్రజల్లో చైతన్యం అంతంతే..

గ్రామాలు, పట్టణాల్లో ఆశావర్కర్లు ఇంటింటికి వెళ్లి కరపత్రాల ఆహ్వాన పత్రిక అందించి కంటివెలుగు శిబిరాన్ని వినియోగించుకోవాలని చైతన్యవంతం చేయాల్సి ఉంది. కానీ ఆచరణలో అలా జరగడం లేదని తెలుస్తోంది. ఆశవర్కర్లకు కంటివెలుగు విధులకు హాజరు కావాలని చెప్పి ఇంటింటికీ ఆహ్వాన పత్రిక అందించాలని చెప్పడమేంటని ప్రశ్నిస్తున్నారు.

అద్దాల పంపిణీ అంతంతే

వైద్య శిబిరాల్లో పరీక్షలు నిర్వహించిన తర్వాత మెజార్టీ ప్రజలకు కంటి సమస్య ఉన్నట్లు స్పష్టమవుతోంది. అయితే జిల్లా అధికారులు మాత్రం హాజరైన వారిలో 40శాతం మందికి మాత్రమే కళ్లద్దాలు పంపిణీ చేయాలని ఆదేశాలు ఇస్తుండడంతో ఏం చేయాలో తెలియక సిబ్బంది అయోమయానికి గురవుతున్నారు. శస్త్రచికిత్సలకు మాత్రం సిఫార్సు చేస్తున్నా.. ఎప్పుడు..? ఎక్కడ..? చేస్తారని మాత్రం చెప్పకపోవడం విశేషం.

ఆహ్వాన పత్రాలు అందించాలి



కంటివెలుగు పరీక్షలకు ప్రభుత్వం ఆహ్వాన పత్రాలను అందించింది. అయితే ఆ ఆహ్వాన పత్రాలు అందించేందుకు ప్రత్యేక సిబ్బంది లేకపోవడంతో ఆశవర్కర్లకు అప్పగించారు. కంటివెలుగు పరీక్షల విధుల్లో పాల్గొనాల్సిన వారు ఆహ్వాన పత్రాలు ఎలా పంపిణీ చేస్తారు..?

– ఊట్ల వరప్రసాద్, యూత్ కాంగ్రెస్ నాయకుడు

స్పందన బాగుంది



శిబిరాలకు ప్రజల నుంచి స్పందన బాగుంది. కొన్ని ప్రాంతాల్లో ఆహ్వాన పత్రాలు అందడం లేదని సమాచారం ఉంది. అలాంటివి జరగకుండా చూస్తాం. 18ఏళ్లు పైబడిన వారందరూ కంటివెలుగు శిబిరాన్ని వినియోగించుకోవాలి. ప్రభుత్వ లక్ష్యం నెరవేర్చాలి. ఇది అందరి బాధ్యత.

– ప్రమోద్ కుమార్, డీఎంహెచ్‌వో

క్లుప్తంగా

బ్లాస్టింగ్ తీరును పరిశీలించిన డీడీఎంఎస్


అధికారులతో సమావేశమైన డీడీఎంఎస్, కార్పొరేటర్ తేజస్విని

గోదావరిఖని(రామగుండం): బ్లాస్టింగ్ తీరును పరిశీలించడానికి డీడీఎంఎస్ అధికారులు వస్తున్నారని తెలిసి సింగరేణి అధికారులు జీడీకే–5 ఓసీపీలో బ్లాస్టింగ్ పదార్థాల మోతాదు తగ్గించారని స్థానిక కార్పొరేటర్ పెద్దెల్లి తేజస్విని, ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేశారు. బుధవారం బ్లాస్టింగ్ తీరును డీడీఎంఎస్‌లు కమలేష్‌వర్మ, సనత్‌కుమార్ పరిశీలించారు. సమీప కాలనీల్లోకి వెళ్లి బ్లాస్టింగ్ చేసిన సమయంలో వైబ్రేషన్ తీరును పరికరాల ద్వారా తనిఖీ చేశారు. రోజూ మధ్యాహ్నం 3.30 గంటలకు జరిగే బ్లాస్టింగ్ ఈరోజు గంట ఆలస్యంగా చేశారని, పేలుడు పదార్థాలు తక్కువ మోతాదులో పెట్టి బ్లాస్టింగ్ చేశారని అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై డీడీఎంఎస్ అధికారులు సింగరేణి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కాకుండా తగు చర్యలు తీసుకుంటామని, తక్కువ మోతాదులో బ్లాస్టింగ్ చేసేలా, ప్రజల ఆరోగ్యానికి హాని జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ఫార్మసీ విద్యార్థి దుర్మరణం



తిమ్మాపూర్(మానకొండూర్): మండలంలోని రామకృష్ణకాలనీ పంచాయతీ పరిధి సుభాష్‌నగర్ వద్ద కేడీసీసీబీ బ్యాంకు ఎదుట రాజీవ్ రహదారిపై బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఫార్మసీ విద్యార్థి దుర్మరణం చెందాడు. ఎల్‌ఎండీ ఎస్సై ప్రమోద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక ఓ ఫార్మసీ కళాశాలలో బీఫార్మసీ రెండో సంవత్సరం చదువుతున్న పారిక సాయిబాబా(19) మధ్యాహ్నం కళాశాల అనంతరం బయటకు వచ్చాడు. తన బుల్లెట్ బైక్‌పై స్నేహితుల వద్దకు వెళ్లాడు. వారితో కాసేపు మాట్లాడిన అనంతరం రాజీవ్ రహదారి మీదుగా కరీంనగర్ బయల్దేరాడు. కేడీసీసీబీ బ్యాంకు ఎదుట ఆటో ఎదురుగా రావడంతో దానిని తప్పించే క్రమంలో కిందపడ్డాడు. ఎదురుగా వస్తున్న లారీ డ్రైవర్ అతివేగంగా నడిపి సాయిబాబాను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సాయిబాబా తలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎల్‌ఎండీ ఎస్సై ప్రమోద్‌రెడ్డి, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. మృతుడి తండ్రి గురుమిల్‌సింగ్ మండలంలోని నర్సింగాపూర్ ప్రభుత్వ పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్నారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎల్‌ఎండీ ఎస్సై తెలిపారు.

గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికితీసే వేదిక


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మంత్రి


మేయర్ సునీల్‌రావు బ్యాటింగ్. మంత్రి కీపింగ్


తలపడుతున్న జట్లు

- విద్యార్థులు, యువత క్రీడా రంగంలో రాణించాలి
- సాక్షి ప్రీమియర్ లీగ్ సీజన్ 4ను ప్రారంభించిన మంత్రి గంగుల

కరీంనగర్‌స్పోర్ట్స్: గ్రామీణ ప్రాంతాల్లోని మెరికల్లాంటి క్రీడాకారులను వెలికి తీసేందుకు 'సాక్షి' ప్రీమియర్ లీగ్ ఒక వేదికలాంటిదని, 'సాక్షి' మీడియా చేస్తున్న ప్రయత్నం అద్వితీయమని రాష్ట్ర బీసీ సంక్షేమం, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్ తిమ్మాపూర్‌లోని జ్యోతిష్మతి ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో 'సాక్షి' మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో, స్టేట్ స్పాన్సర్ సుధాకర్ పీవీసీ పైప్స్ సౌజన్యంతో నిర్వహించిన సాక్షి ప్రీమియర్ లీగ్ సీజన్ 4 పోటీలను మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతోనే యువత, చిన్నారులు సన్మార్గాల్లో నడుస్తారన్నారు. యువత విద్యలోనే కాకుండా అన్నిరంగాల్లోనూ రాణించాలన్నారు. మేయర్ సునీల్ రావు, జ్యోతిష్మతి విద్యాసంస్థల చైర్మన్ సాగర్‌రావు మాట్లాడుతూ ఇలాంటి పోటీలు గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు సువర్ణావకాశమని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి, మేయర్ బ్యాటింగ్ చేసి క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. అంతకుముందు ఉదయం జరిగిన పోటీలను జిల్లా క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి మురళీధర్ రావు ప్రారంభించారు. కార్యక్రమంలో సుధాకర్ పైప్స్ ఏరియా మేనేజర్ షేక్ రఫీ, జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, కార్పొరేటర్ ఎడ్ల అశోక్, కరీంనగర్ సాక్షి యూనిట్ బ్రాంచి మేనేజర్ వైద శ్రీనివాస్, బ్యూరో ఇన్‌చార్జి అనిల్, ఏడీవీటీ మేనేజర్ లక్ష్మీనారాయణ, సర్క్యులేషన్ మేనేజర్ మధుకర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

తొలి రోజు ఫలితాలు

జూనియర్స్ విభాగంలో జ్యోతిష్మతి డిప్లొమా కళాశాల, కరీంనగర్ జట్టు.. అల్ఫోర్స్ జూనియర్ కళాశాల, మంచిర్యాలపై గెలిచింది. ఎస్సారార్ జూనియర్ కళాశాల, మంచిర్యాల జట్టు.. కాకతీయ జూనియర్ కళాశాల, గోదావరిఖని జట్టుపై విజయం సాధించింది. సీనియర్స్ విభాగంలో వివేకానంద డిగ్రీ కళాశాల, కరీంనగర్ జట్టు వివేకానంద ఇంజనీరింగ్ కళాశాల, కరీంనగర్‌పై విజయం సాధించింది. జూనియర్స్ బ్యాటింగ్‌లో రిషి (అల్ఫోర్స్) 23 పరుగులు, ఫిరోజ్ (జ్యోతిష్మతి) 20 పరుగులు, హుశ్రేయర్ (ఎస్సారార్) 19 పరుగులు చేసి అలరించారు. సీనియర్స్‌లో ఆదిల్ (వివేకానంద) 34 పరుగులు చేశారు. కాగా జూనియర్స్ విభాగంలో జ్యోతిష్మతి (కరీంనగర్), ఎస్సారార్ (మంచిర్యాల) జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి.


వికెట్ తీసిన ఆనందంలో..

వరి పంటల పరిశీలన

రామగిరి(మంథని): వరి పంటకు మొగి పురుగు విపరీతంగా సోకినట్లు రామగిరి ఖిలా కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త ఎ.శ్రీనివాస్ తెలిపారు. జిల్లాలోని రామగిరి, కమాన్‌పూర్, ముత్తారం, మంథని, ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాల్లో పురుగు ఉధృతి అధికంగా ఉన్నట్లు పేర్కొన్నారు. బుధవారం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల బృందం వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి వివిధ గ్రామాల్లో వరి పొలాలను పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, వరిలో మొగి పురుగు, చౌడు ప్రభావం, జింక్ ధాతు లోపాలు గుర్తించినట్లు వివరించారు. మొగి పురుగు నివారణకు లీటర్ నీటిలో 2 గ్రాముల కార్టప్ హైడ్రోక్లోరైడ్ లేదా 2.5 మిల్లీ లీటర్ల క్లోరో పైరిఫాస్ 20శాతం ఈసీ లేదా 0.3 మిల్లీ లీటర్ల క్లోరాంట్రినిల్ ప్రోల్ కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఆలస్యంగా నాటు వేసిన పొలాల్లో ఎకరానికి 8కిలోల కార్టప్ హైడ్రక్లోరైడ్ గుళికలు లేదా 4కిలోల క్లోరాంట్రినిల్ ప్రోల్ గుళికలు వేసిన తరువాత పొలంలో నీరు ఇంకేంతవరకు నీటిని ఇవ్వకూడదని పేర్కొన్నారు. జింక్ లోపం నివారణకు లీటర్ నీటిలో 2గ్రాముల జింక్ సల్ఫేట్ మందును కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేసుకొని పొలాన్ని సన్నని పగుళ్లు ఏర్పడే వరకు ఆరబెట్టాలని తెలిపారు. పూర్తి సమాచారం కోసం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలను సంప్రదించి మరిన్ని సూచనలు, సలహాలు, జింక్ సల్ఫేట్ పొందవచ్చని పేర్కొన్నారు. శాస్త్రవేత్తలు సూచించిన మోతాదును రైతులు పాటించాలన్నారు. కార్యక్రమంలో సస్యరక్షణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ వై. వెంకన్న, మృత్తిక శాస్త్రం విభాగం శాస్త్రవేత్త డాక్టర్ కిరణ్ పాల్గొన్నారు.



రైలెక్కిన పొక్లెయిన్లు

ఓదెల: బల్లార్షా నుంచి విజయవాడకు వెళ్లే గూడ్స్ రైలులో బుధవారం పొక్లెయిన్లను రవాణా చేశారు. గూడ్స్ రైలు పెద్దపల్లి, కొత్తపల్లి, కొలనూర్, పొత్కపల్లి స్టేషన్ల మీదుగా వెళ్లడంతో ఆయా రైల్వేస్టేషన్‌లలోని ప్రయాణికులు ఆసక్తిగా తిలకించారు.

తమ్ముడిని హత్య చేశారనే..

- మంథని సుమన్ హత్యలో కీలక పాత్రధారి ధనాల చంద్రశేఖర్
- 15 రోజుల ముందు నుంచే ప్రణాళిక
- జైలులో పరిచయమైన నేరస్తుడితో కలిసి ఘాతుకం
- ఏడుగురు నిందితుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన పెద్దపల్లి డీసీపీ వైభవ్ గైక్వాడ్



నిందితుల అరెస్ట్ చూపుతున్న డీసీపీ వైభవ్ గైక్వాడ్

గోదావరిఖని(రామగుండం): తన తమ్ముడు ధనాల శివకుమార్ అలియాస్ చిన్న హత్యకు ప్రతీకారంగానే మంథని సుమన్‌ను ధనాల చంద్రశేఖర్ హతమార్చాడు. బుధవారం గోదావరిఖని వన్‌టౌన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పెద్దపల్లి డీసీపీ వైభవ్ గైక్వాడ్ వివరాలు వెల్లడించారు. ఘటనకు 15రోజుల ముందునుంచే స్కెచ్ చేసి పక్కా ప్రణాళిక ప్రకారం ప్రధాన నిందితుడు ధనాల చంద్రశేఖర్, వరంగల్ జైలులో అతడికి పరిచయమైన వేముల నవీన్ అలియాస్ బాబి కలిసి సుమన్‌ను హత్య చేసినట్లు పేర్కొన్నారు. దీనికి చంద్రశేఖర్ బంధువులు సహకరించారు. గోదావరిఖని లెనిన్‌నగర్‌లో నివాసముంటున్న చంద్రశేఖర్ ప్రస్తుతం విజయవాడలో ఉంటున్నాడు. ఇతడిపై గతంలో రౌడీషీట్‌తో పాటు పలు కేసులు ఉన్న క్రమంలో పీడీయాక్ట్ నమోదు చేసి 2019లో వరంగల్ జైలుకు పంపారు. తన తమ్ముడ్ని 2018లో హత్య చేసిన సుమన్‌ను ఏలాగైనా చంపాలనే నిర్ణయించుకున్నాడు. వరంగల్ జైలులో ఉన్న సమయంలో వేముల నవీన్ అలియాస్ బాబితో పరిచయమైంది. ఈక్రమంలో మంథని సుమన్ హత్యకు సహకరిస్తే హైదరాబాద్‌లో రెస్టారెంట్ పెట్టుకునేందుకు ఆర్థికసాయం చేస్తానని చెప్పడంతో బాబి ఒప్పుకున్నాడు.

అదనుచూసి ప్రధాన చౌరస్తాలోనే..

మంథని సుమన్‌ను హత్య చేసేందుకు హైదరాబాద్‌లో ఉంటున్న బాబి గత నెల 28న గోదావరిఖనికి బస్సులో వచ్చాడు. తర్వాత చంద్రశేఖర్, బాబి ఇద్దరూ ఆనంద్ ఇంట్లో బస చేశారు. గత నెల 29న రాత్రి 8.20 గంటల సమయంలో చంద్రశేఖర్, బాబి ప్రధాన చౌరస్తా వద్దకు వచ్చారు. అప్పుడే సుమన్ చాయ్ తాగి తన ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌కు చేరుకుంటున్న క్రమంలో చంద్రశేఖర్, బాబి కత్తులతో విచక్షణరహితంగా దాడి చేసి చంపేశారు. అనంతరం బాబి రైలులో హైదరాబాద్ పారిపోయాడు.

ఏడుగురి అరెస్ట్

మంథని సుమన్ హత్య కేసులో ఏడుగురిని అరెస్ట్ చేశారు. గోదావరిఖని లెనిన్‌నగర్‌కు చెందిన ధనాల చంద్రశేఖర్, హైదరాబాద్ బేగంపేట్ ప్రకాశ్‌నగర్‌కు చెందిన వేముల నవీన్ అలియాస్ బాబి, ప్రధాన నిందితుడి బావ యైటింక్లయిన్ కాలనీకి చెందిన మాదుగుల శ్రీనివాస్, చెల్లె మాదుగుల స్వరూప, బంధువులు గోదావరిఖని హనుమాన్‌నగర్‌కు చెందిన గంరేటి అజయ్‌కుమార్, గంరేటి శేషి, రామగుండం హౌజింగ్ బోర్డు కాలనీకి చెందిన బంగారి ఆనంద్‌ను అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి మూడు కత్తులు, ఆటో, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరిచారు. ఈకేసులో చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకున్న గోదావరిఖని ఏసీపీ గిరిప్రసాద్, సీఐలు రమేష్‌బాబు, ప్రసాద్ రావు, ఇతర అధికారులు, సిబ్బందిని డీసీపీ అభినందించారు.

రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా

ఇటీవల హత్యకు గురైన సుమన్, హత్య చేసిన చంద్రశేఖర్ ఇద్దరు రౌడీషీటర్లు కావడంతో.. ఇక ముందు రౌడీషీటర్లపై పోలీసుల వైఖరి ఏలా ఉండబోతోందని అడిగిన ప్రశ్నకు డీసీపీ స్పందించారు. ఈవిషయంలో సీపీ సీరియస్‌గా ఉన్నారని, త్వరలో జిల్లా వ్యాప్తంగా ఉన్న రౌడీషీటర్లకు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



మొదలైన మినీ సమ్మక్క సారలమ్మ జాతర


పెద్దగుట్ట సమీపంలో మినీ సమ్మక్కజాతర

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం తుర్కలమద్దికుంట పెద్దగుట్ట సమీపంలో మినీ సమ్మక్క–సారలమ్మ జాతర మొదలైంది. జాతరకమిటీ అధ్యక్షుడు, వైస్‌ఎంపీపీ ముత్యాల రాజయ్య సారథ్యంలో కమిటీ సభ్యులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. జాతర ప్రాంతంలో అవసరమైన వసతులను కల్పించారు. సర్పంచ్ జయప్రద, సంజీవరెడ్డి,రాము, గోపాల్, లక్ష్మీనర్సయ్య, తిరుపతి, వెంకటస్వామి, హనుమంతు, లక్ష్మణ్, సారయ్య పాల్గొన్నారు.

రైతుల మన్ననలు పొందాలి

- నూతన పాలకవర్గాలను అభినందించిన జెడ్పీ చైర్మన్


అభినందిస్తున్న మధు

మంథని: మంథని, కమాన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ పాలకవర్గాలు రైతుల మన్ననలు పొందేలా సేవలందించాలని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు సూచించారు. బుదవారం మంథనిలోని జెడ్పీ చైర్మన్ నివాసంలో మార్కెట్ కమిటీ చైర్మన్లు ఎక్కేటి అనంతరెడ్డి, దాసరి రాజలింగు, పాలకవర్గ సభ్యులను మధు సన్మానించారు. పాలకవర్గాలు ఆదర్శంగా ఉండేలా పనిచేయాలని సూచించారు.

ట్రాక్టర్ ఢీకొని ఒకరు మృతి

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని పురాణిపేటకు చెందిన ఇనుగుర్తి భూమయ్య(70) కాంతిభవన్ సమీపంలో ద్విచక్ర వాహనంపై రోడ్డు దాటుతుండగా ట్రాక్టర్ ఢీకొని మృతిచెందాడు. పురాణిపేటకు చెందిన ఇనుగుర్తి భూమయ్య పని నిమిత్తం ఇంటి నుంచి బయటకు వచ్చాడు. కాంతిభవన్ సమీపంలో రోడ్డు దాటుతుండగా ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ భూమయ్య ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కువ రారుడు శ్రీధర్ ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ కిశోర్ తెలిపారు.

ఆర్జీ–2లో 112 శాతం బొగ్గు ఉత్పత్తి


మాట్లాడుతున్న జీఎం మనోహర్

గోదావరిఖని(రామగుండం): సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–2 ఏరియాలో జనవరి నెలలో 112 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు జీఎం ఎ.మనోహర్ వెల్లడించారు. బుధవారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జనవరిలో 7.52 లక్షల టన్నుల లక్ష్యానికి గాను 8.41 లక్షల టన్నుల బొగ్గు సాధించి నిర్దేశిత లక్ష్యాలకు మించి ఉత్పత్తి సాధించినట్లు వివరించారు. రాబోయే రెండు నెలల కాలంలో కూడా ఇదే స్ఫూర్తితో పని చేస్తూ రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలన్నారు. సమావేశంలో ఎస్‌ఓటూజీఎం అబ్దుల్‌సలీం, ఇంజినీర్ నర్సింహారావు, డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీ–3లో 90శాతం.. ఏపీఏలో 106 శాతం బొగ్గు ఉత్పత్తి

రామగిరి: సింగరేణి సంస్థ జనవరిలో ఆర్జీ–3 ఏరియాలో 90శాతం, ఏపీఏ ఏరియాలో 106శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు ఆర్జీ–3, ఏపీఏ జీఎంలు వెంకటేశ్వర్‌రావు, కె.వెంకటేశ్వర్లు తెలిపారు. సెంటినరీకాలనీలోని గెస్ట్‌హౌస్‌లో విలేకరులతో మాట్లాడారు. ఆర్జీ–3 ఏరియా 6.40 లక్షల టన్నులకు 5.75లక్షల టన్నులు ఉత్పత్తి చేసిందని, ఓసీపీ–1లో 3.40 లక్షల టన్నులకు 3.47 లక్షల టన్నులు ఉత్పత్తి చేసి 102 శాతం, ఓసీపీ–2లో 3 లక్షల టన్నులకు 2.27 లక్షల టన్నులు ఉత్పత్తి చేసి 90 శాతం సాధించిందన్నారు. ఏపీఏ పరిధిలోని అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్ట్ 1.82 లక్షలటన్నులకు 1.92 లక్షల టన్నులు ఉత్పత్తి చేసి 106 శాతం నమోదు చేసిందన్నారు. ఏరియా ఇంజినీర్‌లు ఎలీషా, సీతారామం, ఫైనాన్స్ ఏజీఎం పి.శ్రీనివాసులు, ప్రాజెక్ట్ అధికారులు రాధాకృష్ణ, నరేందర్, నాగేశ్వరరావు, ప్రాజెక్ట్ ఇంజినీర్ రఘురాం, డీజీఎంలు చంద్రశేఖర్, విలాస్ శ్రీనివాస్‌పోద్దార్, ఎస్‌ఈ పద్మరాజు తదితరులు పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి


సీఅండ్‌ఎండీ శ్రీధర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జనక్‌ప్రసాద్

గోదావరిఖని(రామగుండం): పెండింగ్‌లో ఉన్న కార్మికుల డిమాండ్లను పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలని కోరుతూ సంస్థ సీఅండ్‌ఎండీ శ్రీధర్‌ను ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ కోరారు. బుధవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. యాజమాన్యంతో అన్ని యూనియన్లు చేసిన ఒప్పందంలో పెండింగ్‌లో ఉన్న మారు పేర్ల మార్పు, డిపెండెంట్లకు ఉద్యోగార్హత వయస్సు 40ఏళ్లకు పెంచాలన్నారు. రామగుండం రీజియన్‌లోని ఆర్జీ–1,2,3లో కార్మిక కుటుంబాలకు శాశ్వత పరిష్కారంగా రక్షిత మంచినీరు అందించాలన్నారు. కొత్త బొగ్గు గనులను ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. సింగరేణి ఆధ్వర్యంలో రెండు సిమెంట్ ఫ్యాక్టరీలను ఏర్పాటు చేయాలని అందులో ఒకటి రామగుండంలో నిర్మించాలన్నారు. సింగరేణి కారుణ్య నియమకాల్లో అనేక కొర్రీలు పెట్టి కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, వాటిని సరళీకృతం చేసి కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు కల్పించడంలో సహకారం అందించాలన్నారు. సింగరేణిలో ఎన్నికలు నిర్వహించే వరకు అన్నీ కార్మిక సంఘాలను చర్చలకు పిలవాలన్నారు. సింగరేణిలో రాజకీయ జోక్యాన్ని తగ్గించి సంస్థ నిధులు మళ్లకుండా చూడాలని కోరారు.

బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వర్లు


సన్మానిస్తున్న జీఎం వెంకటేశ్వరరావు

రామగిరి(మంథని): అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా (ఏపీఏ) జీఎంగా కె.వెంకటేశ్వర్లు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ జీఎంగా పని చేసిన ఎన్‌వీకే.శ్రీనివాస్ డైరెక్టర్(ఆపరేషన్స్)గా నియామకమయ్యారు. ఈసందర్భంగా ఏపీఏ జీఎంను ఆర్జీ–3 జీఎం తన్నీరు వెంకటేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా జీఎం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, అధికారులు, ఉద్యోగుల సమన్వయంతో విధులు నిర్వహిస్తూ యాజమాన్యం నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యసాధనకు కృషి చేస్తానని వివరించారు.

రైతు ఆత్మహత్య

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండలం మొర్రాయిపల్లెకు చెందిన రైతు దమ్మ లచ్చయ్య (55) పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు. లచ్చయ్య బుధవారం వ్యవసాయ పనుల కోసం పొలానికి వెళ్లాడు. మధ్యాహ్నం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటున్నానని కూతురు సోనికి ఫోన్‌చేసి తెలిపాడు. దీంతో కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లి చూడగా అపస్మారక స్థితిలో కనిపించాడు. హుటాహుటిన ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మృతిచెందాడు. అప్పుల బాధలు భరించలేక లచ్చయ్య ఆత్మహత్యకు పాల్పడ్డాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు. లచ్చయ్య మృతితో భార్య ఎల్లవ్వ, కూతురు సోని రోదనలు మిన్నంటాయి. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.